# మనం





## నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం । 10 । జూన్ । 2026 పేజీలు: 7


## రావుట్ల అటవీ భూముల కబ్జా, చెట్ల నరికివేతపై ఎమ్మెల్యే స్పందన



2

- అటవీ భూముల రికవరీకి చర్యలు తీసుకుంటాం.
- పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలి.

# కామారెడ్డి మున్సిపల్‌లో భారీగా అక్రమాలు



- రూ.90 లక్షలకుపైగా ప్రభుత్వ ఆస్తుల అక్రమ విక్రయం జరిగినట్టు ఆరోపణ.
- సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి.. కౌన్సిలర్ కళ్లెం సావిత్రి సత్యం.
- 19 మంది కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులతో జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, చైర్పర్సన్లకు ఫిర్యాదు.

2

కామారెడ్డి మున్సిపాలిటీకి చెందిన ప్రభుత్వ ఆస్తులు, స్క్రాప్ సామగ్రి, కాపర్ వస్తువులు, పాత మోటార్లు తదితర విలువైన సామగ్రిని అక్రమంగా తరలించి విక్రయించడం వల్ల రూ.90 లక్షలకు పైగా ప్రభుత్వానికి నష్టం వాటిల్లిందని 20వ వార్డు కౌన్సిలర్ కళ్లెం సావిత్రి సత్యం ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఆర్డీవో, ఇన్చార్జి అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్పర్సన్లకు ఫిర్యాదు సమర్పించారు.



# భిక్నూర్ పంచాయతీ ఖజానాకు గండి

- సామాన్యుడికి చట్టాలు
- కార్పొరేట్ సంస్థలకు మినహాయింపులా?
- గంపెడు కూరగాయలు అమ్ముకునే పేద రైతుకు వసూలు, ఫీజులు గుంజే స్కూల్కు ఫ్రీనా?
- భిక్నూర్ మార్కెట్ స్థలంలో ప్రైవేట్ స్కూల్ పాగా.
- 15 ఏళ్లుగా మార్కెట్ స్థల వినియోగంపై పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం.
- గణాంకాలతో అవినీతి ఆరోపణలు చేసిన సామాజిక కార్యకర్త బత్తుల భిక్షపతి.
- బకాయిలు వసూలు చేయకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరిక.

5

# కోటిమంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యం



- మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ బస్సుల పంపిణీ
- ఇందల్వాయి టోల్ ప్లాజా వద్ద మహిళలకు వీడ్కోలు పలికిన ఎమ్మెల్యే భూపతి రెడ్డి.

4



# కామారెడ్డి మున్సిపల్‌లో భారీగా అక్రమాలు

**- రూ.90 లక్షలకుపైగా ప్రభుత్వ ఆస్తుల అక్రమ విక్రయం జరిగినట్టు ఆరోపణ.**

**- సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి.. కౌన్సిలర్ కళ్లెం సావిత్రి సత్యం.**

**- 19 మంది కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులతో జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, చైర్పర్సన్లకు ఫిర్యాదు**





కామారెడ్డి, జూన్ 9 (మనం న్యూస్): కామారెడ్డి మున్సిపాలిటీకి చెందిన ప్రభుత్వ ఆస్తులు, స్క్రాప్ సామగ్రి, కాపర్ వస్తువులు, పాత మోటార్లు తదితర విలువైన సామగ్రిని అక్రమంగా తరలించి విక్రయించడం వల్ల రూ.90 లక్షలకు పైగా ప్రభుత్వానికి నష్టం వాటిల్లిందని 20వ వార్డు కౌన్సిలర్ కళ్లెం సావిత్రి సత్యం ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఆర్డీవో, ఇన్చార్జి అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్పర్సన్లకు ఫిర్యాదు సమర్పించారు. తెలిపిన వివరాల ప్రకారం, కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని వాటర్ ఫిల్టర్ బెడ్ గోదాం, బుర్ర మత్తడి, పెద్దచెరువు ప్రాంతం, వాటర్ బెడ్ ట్యాంక్ పరిసరాలు, జాతీయ రహదారి పక్కన నిల్వ ఉంచిన స్క్రాప్ సామగ్రి, కాపర్ వస్తువులు, పాత మోటార్లు తదితర ప్రభుత్వ ఆస్తులను 2024 డిసెంబర్ 10వ తేదీ రాత్రి కొందరు వ్యక్తులు కూలీల సహాయంతో ఎటువంటి అధికారిక అనుమతులు లేకుండా తరలించినట్లు సమాచారం వెలుగులోకి వచ్చిందని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఇప్పటికే 2024 డిసెంబర్ 15న మున్సిపల్ కౌన్సిలర్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, డిసెంబర్ 16న మున్సిపల్ కమిషనర్కు, డిసెంబర్ 21న జిల్లా కలెక్టర్కు కూడా లిఖితపూర్వకంగా ఫిర్యాదులు అందజేసినప్పటికీ ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై ప్రజలకు స్పష్టత ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**- ప్రభుత్వ ఆస్తులను రికవరీ చేయాలి.**

పలు వార్డుల్లో నిల్వ ఉంచిన స్క్రాప్ మరియు ఇతర విలువైన సామగ్రిని కూడా అక్రమంగా విక్రయించినట్లు ఆరోపణలు వెలుగులోకి రాగా, వార్డుల నుంచి తరలించబడిన సామగ్రి విలువ సుమారు రూ.35 లక్షలు కాగా, వాటర్ ఫిల్టర్ బెడ్ గోదాం నుంచి తరలించబడిన సామగ్రి విలువ సుమారు రూ.60 లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. మొత్తం మీద ప్రభుత్వానికి రూ.90 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో అప్పటి మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియ, ఆమె భర్త గడ్డం చంద్రశేఖర్ రెడ్డి పాత్రపై పత్రికల్లో పలు కథనాలు వెలువడ్డాయని పేర్కొన్నారు. కాగా వాటర్ ఫిల్టర్ బెడ్ వద్ద విధులు నిర్వహించిన వాటర్ వర్క్స్ ఉద్యోగి శ్యామ్ ఇచ్చిన వాంగ్మూలంలో సంబంధిత వ్యక్తుల సమక్షంలోనే సామగ్రి తరలించినట్టు తెలిపారు. ప్రజల పన్నుల రూపంలో సమకూరిన నిధులతో కొనుగోలు చేసిన ప్రభుత్వ ఆస్తులను అక్రమంగా విక్రయించడం తీవ్రమైన అవినీతి చర్యగా పరిగణించి ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు, పూర్తి స్థాయి ఆడిట్, అక్రమంగా తరలించిన ఆస్తుల రికవరీ, గత ఫిర్యాదులపై తీసుకున్న చర్యల నివేదిక విడుదల, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కౌన్సిలర్లు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించకపోతే ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఐరేనీ సందీప్ కౌన్సిలర్లు అంజద్, లడ్డు, కాళ్ల రాజమణి, వనిత రామ్మోహన్, మహమ్మద్ ఇసాక్ షేరు, కాళ్ళ గణేష్, మాజీద్, కళ్లెం సత్యం, రామ్మోహన్ తో పాటు 17 మంది వార్డు కౌన్సిలర్లు, ముగ్గురు కో-ఆప్షన్ సభ్యులు మరియు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రావుట్ల అటవీ భూముల కబ్జా, చెట్ల నరికివేతపై ఎమ్మెల్యే స్పందన

**- అటవీ భూముల రికవరీకి చర్యలు తీసుకుంటాం.**

**- పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలి.**



నిజామాబాద్ రూరల్, జూన్ 9 (మనం న్యూస్): సిరికొండ మండలం రావుట్ల గ్రామంలో అటవీ భూముల్లో చెట్ల నరికివేత, అటవీ భూముల కబ్జా అంశంపై నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి మంగళవారం స్పందించారు. ఈ సందర్భంగా గతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రావుట్ల గ్రామంలో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నా, చెట్ల నరికివేత జరుగుతున్నా అప్పటి ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని ఎమ్మెల్యే ఆరోపించారు. సొంత గ్రామంలోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్న సమయంలో ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. అటవీ భూముల ఆక్రమణలను చూసీచూడనట్లుగా వ్యవహరించడం బాధాకరమని పేర్కొన్నారు. రాజకీయ విమర్శలకు అతీతంగా అటవీ భూములను తిరిగి రికవరీ చేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ విషయంలో ఇప్పటికే అటవీశాఖ అధికారులతో చర్చలు జరిపినట్లు వెల్లడించారు. ఆక్రమణకు గురైన అటవీ భూములను తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అటవీ సంపద పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు.



నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలో అటవీ భూముల సంరక్షణకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఈ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అటవీ సంపదను కాపాడేందుకు ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అటవీ భూముల రక్షణలో ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ యూనివర్సిటీలో 2014 అధ్యాపకులకు పదోన్నతులు కల్పించాలి

**- టీచర్స్ అసోసియేషన్ డిమాండ్**

**- ఈ నెల 16 నుంచి నిరసన కార్యక్రమాలకు హెచ్చరిక**



నిజామాబాద్ రూరల్, జూన్ 9 (మనం న్యూస్): తెలంగాణ విశ్వవిద్యాలయంలో 2014లో నియామకం పొందిన అధ్యాపకులందరికీ రాష్ట్ర హైకోర్టు డివిజన్ బెంచ్ తుది తీర్పులకు లోబడి పదోన్నతులు కల్పించాలని తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టూటా) డిమాండ్ చేసింది. ఈ మేరకు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. యాదగిరికి అసోసియేషన్ ప్రతినిధులు నిరసన నోటీసు అందజేశారు. పదోన్నతుల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, లేకపోతే ఈ నెల 16వ తేదీ నుంచి ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అధ్యాపకులు గత 12 సంవత్సరాలుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తూ తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అసోసియేషన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను ఇకపై మరింత కాలం పెండింగ్లో ఉంచకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. ఇటీవల విశ్వవిద్యాలయంలో నిర్వహించిన తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో ఈ అంశంపై విస్తృతంగా చర్చించి, 2014 బ్యాచ్ అధ్యాపకులందరికీ పదోన్నతులు కల్పించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. అధ్యాపకుల న్యాయమైన హక్కులను పరిరక్షించేందుకు అవసరమైతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని అసోసియేషన్ స్పష్టం చేసింది.



# గ్రామ ప్రగతికి దిక్సూచి 'గ్రామసభ'

**పౌరుల భాగస్వామ్యమే పంచాయతీల బలం!**
**కనీసం 3 రోజుల ముందు అందరికి సమాచారం అందించాల్సిన బాధ్యత పంచాయతీ అధికారులదే**

భిక్నూర్, (మనం న్యూస్): ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైనది, క్షేత్రస్థాయిలో ప్రజల స్వయంపాలనకు నిదర్శనం 'గ్రామసభ'. కేవలం ఒక సమావేశంగా కాకుండా, గ్రామాభివృద్ధిని నిర్దేశించే ఒక శక్తివంతమైన వేదిక ఇది. ప్రతి గ్రామ పరిధిలో స్థానిక సమస్యల పరిష్కారానికి, పారదర్శకమైన పాలనకు గ్రామసభలే మూలస్తంభాలు. గ్రామంలోని ప్రతి ఓటరు ఇందులో సభ్యుడే. అయితే, గ్రామసభలు కేవలం మొక్కుబడి సమావేశాలుగా సాగకుండా, ఆశించిన లక్ష్యాలను సాధించాలంటే పౌరులు, ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉంది.

**గ్రామంలో గ్రామ పౌరుల విధులు బాధ్యతగల ఓటరే గ్రామ భాగ్యవిధాత**

గ్రామసభ విజయవంతం కావడంలో అత్యంత ముఖ్యమైన పాత్ర గ్రామ పౌరులదే. హక్కుల గురించి మాట్లాడే ప్రతి పౌరుడు, తన విధులను కూడా అంతే నిష్పక్షపాతంగా నిర్వహించాలి.

గ్రామంలో జరిగే ప్రతి గ్రామసభకు ఓటర్లందరూ కుల, మత, రాజకీయాలకతీతంగా హాజరుకావడం ప్రాథమిక విధి. సభలో మూగప్రేక్షకుల్లా కూర్చోకుండా, గ్రామ ప్రయోజనాల కోసం జరిగే చర్చల్లో చురుగ్గా పాల్గొనాలి.

**సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్)..**

గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల నాణ్యతను, ఖర్చులను పర్యవేక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత.గ్రామ పంచాయతీకి చెల్లించాల్సిన ఇండ్ల పన్ను, నీటి పన్ను వంటివి సకాలంలో చెల్లించి గ్రామ ఆర్థిక పురోభివృద్ధికి సహకరించాలి.

**పౌరులు ఎలాంటి ప్రశ్నలను లేవనెత్తాలి..?**

గ్రామసభలో పాలకవర్గాన్ని నిలదీయడం అంటే గొడవపడటం కాదు, గ్రామాభివృద్ధి కోసం హేతుబద్ధమైన ప్రశ్నలు అడగడం. పౌరులు ముఖ్యంగా

**ఈ క్రింది అంశాలపై ప్రశ్నించాలి...**

ఆదాయ, వ్యయాల వివరాలు'గత ఆరు నెలల్లో పంచాయతీకి వచ్చిన ప్రభుత్వ నిధులు ఎంత? పన్నుల రూపంలో వసూలైన ఆదాయం ఎంత? వాటిని ఏ ఏ పనులకు ఖర్చు చేశారు?' అనే లెక్కలను అడగాలి. పన్నులు సకాలంలో వస్తున్నాయా అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా సాగుతున్నాయా అనేది తెలుసుకోవడం ముఖ్యమైన బాధ్యత.



ప్రభుత్వ సంక్షేమ పథకాలు (పింఛన్లు, ఇండ్లు, రేషన్ కార్డులు వంటివి) అర్హులకు అందుతున్నాయా లేదా? లబ్ధిదారుల ఎంపిక ఏ ప్రాతిపదికన జరిగిందని ప్రశ్నించాలి.తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, మురుగుదొడ్ల పరిశుభ్రత, అంతర్గత రహదారుల మరమ్మత్తులపై నిలదీయాలి. స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వసతులు, సిబ్బంది హాజరు తీరుపై ప్రశ్నలు లేవనెత్తాలి.

**పంచాయతీ పాలకవర్గం (సర్పంచ్, వార్డు సభ్యులు) బాధ్యతలు**

గ్రామసభ పట్ల పంచాయతీ పాలకవర్గం పూర్తి జవాబుదారీతనంతో వ్యవహరించాలి. చట్టప్రకారం ఏడాదికి కనీసం నాలుగు సార్లు గ్రామసభలను ఏర్పాటు చేయాలి. సభ నిర్వహణకు ముందే గ్రామమంతటా విస్తృతంగా ప్రచారం కల్పించాలి. పౌరులు అడిగే కఠినమైన ప్రశ్నలకు సహనంతో సమాధానం చెప్పాలి. విమర్శలను సానుకూలంగా స్వీకరించి, లోపాలను సరిదిద్దుకోవాలి. గ్రామసభలో ఆమోదించిన తీర్మానాలను, బడ్జెట్ వివరాలను పంచాయతీ నోటీస్ బోర్డుపై ప్రజలందరికీ కనిపించేలా ప్రదర్శించాలి.

**నిధుల సద్వినియోగం...**

రాజకీయ పక్షపాతం లేకుండా, అత్యంత సమస్యాత్మకమైన వార్డుల అభివృద్ధికి నిధులను కేటాయించాలి. కేంద్ర ప్రభుత్వం నుండి అలాగే రాష్ట్ర ప్రభుత్వం నుండి ఏ విధంగా నిధులు వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వమే కాకుండా గ్రామపంచాయతీకి జనరల్ ఫండ్ ద్వారా కూడా నిధులు వస్తాయి ఆ నిధులు సక్రమంగా ఖర్చవుతున్నాయా ప్రజలకు తెలియజేయాలి.

**పంచాయతీ కార్యదర్శి (సెక్రటరీ) విధులు: పాలనకు, ప్రజలకు వారధి**

గ్రామ పంచాయతీ పరిపాలనలో ప్రభుత్వ ప్రతినిధిగా పంచాయతీ కార్యదర్శి పాత్ర అత్యంత కీలకమైనది. గ్రామసభ సజావుగా సాగడంలో ఆయన విధులు ఇలా ఉంటాయి..

**సమావేశాల నిర్వహణ, నోటీసులు...**

సర్పంచ్ ఆదేశాల మేరకు గ్రామసభ తేదీని ఖరారు చేసి, గ్రామస్తులందరికీ కనీసం 7 రోజుల ముందే దండోరా (చాటింపు) ద్వారా లేదా నోటీసుల ద్వారా సమాచారం అందించాలి. గ్రామ సభ గురించి ప్రజలందరికీ అవగాహన ఏర్పడేలా గ్రామసభలలో అవగాహన కార్యక్రమం పెట్టాలి గ్రామ ప్రజలందరూ పెద్ద మొత్తంలో గ్రామసభకు హాజరయ్యేలా అవగాహన కల్పించాలి.

**ప్రొసీడింగ్స్ (నిమిషాల పుస్తకం) నమోదు...**

గ్రామసభలో ప్రజలు లేవనెత్తిన సమస్యలు, పాలకవర్గం ఇచ్చిన సమాధానాలు, సభలో ఆమోదించిన తీర్మానాలను 'మినిట్స్ బుక్' లో ఖచ్చితంగా నమోదు చేయాలి.

గ్రామసభ తీర్మానాల ప్రతులను, బడ్జెట్ నివేదికలను ఉన్నతాధికారులకు మండల అధికారులకు, సకాలంలో పంపించాలి. గ్రామ పంచాయతీకి సంబంధించిన అన్ని రకాల అకౌంట్లు, రిజిస్టర్లను సిద్ధంగా ఉంచి, గ్రామసభలో ప్రజల పరిశీలనకు ఉంచాలి. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా ఆర్థిక క్రమశిక్షణను పర్యవేక్షించాలి.

'గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యం' అన్న మహాత్మా గాంధీ కలలు సాకారం కావాలంటే గ్రామసభలు బలోపేతం కావాలి. హక్కుల కోసం ప్రశ్నించే పౌరుడు, జవాబుదారీతనంతో పనిచేసే పాలకవర్గం, చట్టబద్ధంగా వ్యవహరించే కార్యదర్శి... ఈ ముగ్గురి సమన్వయమే గ్రామాన్ని ప్రగతిపథంలో నడిపిస్తుంది. రాబోయే గ్రామసభలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవుదాం, మన గ్రామ భవిష్యత్తును మనమే నిర్మించుకుందాం.

## కాంగ్రెస్‌కు సొంత భవనానికి భూమి కేటాయింపు

**- డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ కృషితో ఒక ఎకరం మంజూరు.**

కామారెడ్డి, జూన్ 9 (మనం న్యూస్): కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీకి సొంత కార్యాలయ భవనం నిర్మాణానికి ప్రభుత్వం ఒక ఎకరం భూమిని కేటాయించింది. జిల్లా కేంద్ర సమీపంలోని అడ్లూర్ శివారులో సర్వే నంబర్ 527/42/1/2లో ఉన్న ప్రభుత్వ భూమిని పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం మంజూరు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ప్రత్యేక చొరవతో ఈ భూమి కేటాయింపు సాధ్యమైందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకు శాశ్వత కార్యాలయం లేని కాంగ్రెస్ పార్టీకి ఈ నిర్ణయంతో స్థిర చిరునామా లభించనుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్తో పాటు సహకరించిన అధికారులకు ఏలే మల్లికార్జున్ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే కార్యాలయ భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు.



## వైభవంగా శ్రీ కల్కి భగవతి భగవానుల కళ్యాణం

**- సుమారు 500 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ.**





కామారెడ్డి, జూన్ 9 (మనం న్యూస్): కామారెడ్డి పట్టణ కేంద్రంలోని శ్రీ కల్కి ఆలయంలో శ్రీ కల్కి భగవతి భగవానుల కళ్యాణ మహోత్సవాన్ని మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కళ్యాణ మహోత్సవం అనంతరం నిర్వహించిన అన్నప్రసాద వితరణలో సుమారు 500 మంది భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమాల నిర్వహణకు సహకరించిన దాతలకు ఆలయ నిర్వాహకులు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సేవకులు ఎర్రం చంద్రశేఖర్, ఎర్రం విజయ్, డా. బాలు, సిద్ధంశెట్టి శ్రీనివాస్, పార్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కోటిమంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యం







**- మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ బస్సుల పంపిణీ**
**- ఇందల్వాయి టోల్ ప్లాజా వద్ద మహిళలకు వీడ్కోలు పలికిన ఎమ్మెల్యే భూపతి రెడ్డి.**

నిజామాబాద్ రూరల్, జూన్ 9 (మనం న్యూస్): మహిళల ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తూ కోటిమంది మహిళలనుకోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల ద్వారా ఆర్టీసీ బస్సులను అందజేస్తూ వారి ఆదాయ వనరులను పెంపొందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల మహిళా సమాఖ్యలకు మంజూరైన ఏడు ఆర్టీసీ బస్సులను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా స్వీకరించేందుకు మహిళలు మంగళవారం హైదరాబాద్కు బయలుదేరారు. ఈ సందర్భంగా ఇందల్వాయి టోల్ ప్లాజా వద్ద ఎమ్మెల్యే భూపతి రెడ్డి పచ్చజెండా ఊపి బస్సులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ., దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో మహిళా సాధికారత కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇప్పటివరకు బస్సుల్లో ప్రయాణికులుగా ఉన్న మహిళలను ఇప్పుడు బస్సుల యజమానులుగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఒక్కో బస్సుపై రూ.36 లక్షల వ్యయంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో మహిళా సంఘాల వాటాగా రూ.6 లక్షలు ఉండగా, మిగిలిన రూ.30 లక్షలను బ్యాంకు లింకేజీ ద్వారా వడ్డీలేని రుణాల రూపంలో అందిస్తున్నట్లువివరించారు.
నియోజకవర్గంలోని ఏడు బస్సులకు మొత్తం రూ.2.52 కోట్లు, జిల్లా వ్యాప్తంగా 28 బస్సులకు రూ.10.08 కోట్ల వ్యయంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. మహిళా సంఘాలు ఈ బస్సులను ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం ద్వారా ఒక్కో బస్సుపై నెలకు సుమారు రూ.75 వేల వరకు, సంవత్సరానికి రూ.9 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. దీంతో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఏడు బస్సుల ద్వారా సంవత్సరానికి రూ.63 లక్షల ఆదాయం, జిల్లా వ్యాప్తంగా 28 బస్సుల ద్వారా రూ.2.52 కోట్ల ఆదాయం మహిళా సంఘాలకులభించనుందని తెలిపారు. ఈ విధంగా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా తీర్చిదిద్దే ప్రభుత్వ లక్ష్యం కార్యరూపందాల్చుతోందన్నారు.అదేవిధంగా మహిళలకు సౌర విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకుల ఏర్పాటుకు అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. గత రెండున్నర సంవత్సరాల్లో సుమారు రూ.70 వేల కోట్లకు పైగా బ్యాంకు లింకేజీ ద్వారా వడ్డీలేని రుణాలు అందించామని పేర్కొన్నారు. మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు హైదరాబాద్ శిల్పారామంలో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.మహిళా సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం దేశంలోనే ఆదర్శంగా నిలిచే విధంగా తెలంగాణ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, మహిళలు చేపట్టే ప్రతి వ్యాపారానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ సాయారెడ్డి, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచ్ ఫోరం నాయకులు, సర్పంచులు, పార్టీ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి ఎంఎల్బీ కప్ ఇండియా పోటీలకు సత్యశోధక్ పాఠశాల జట్టు ఎంపిక

**- బెంగుళూరులో జరిగే పోటీల్లో ప్రతిభ చాటేందుకు సిద్ధమైన విద్యార్థులు.**

నిజామాబాదు రూరల్, జూన్ 9 (మనం న్యూస్): కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరులో ఈ నెల 11 నుంచి 14 వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి మేజర్ లీగ్ బేస్బాల్ (ఎంఎల్ బి) కప్ ఇండియా-2026 పోటీలకు సిరికొండ మండలంలోని సత్యశోధక్ పాఠశాల (కార్డినల్స్) జట్టు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది.

గత ఏప్రిల్ 23 నుంచి 26 వరకు ఆర్మూర్ మినీ స్టేడియంలో నిర్వహించిన నిజామాబాద్ రీజినల్ ఉభయ రాష్ట్రాల మేజర్ లీగ్ బేస్బాల్ కప్ ఇండియా అండర్-11 ఛాంపియన్షిప్ పోటీల్లో సత్యశోధక్ జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి గ్రూప్-బి విజేతగా నిలిచింది. ఛాంపియన్షిప్పు కైవసం చేసుకుని జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. జట్టులో హర్షిత్, సతీష్, శివచరణ్, శ్రీరామ్, సాయి సృజన్, అభిరామ్, విశ్వక్ సేనా, విధ్వాన్, రిషివరుణ్ తేజ్, రిశ్విత్, పి. రిత్విక్, టి. రిత్విక్ సభ్యులుగా ఉన్నారు. పాఠశాల పీ.ఈ.టీలు బాదావత్ సంతోష్, దండు అనిల్ కోచ్లు, మేనేజర్లుగా వ్యవహరిస్తున్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు బెంగుళూరుకు బయలుదేరుతున్న జట్టు సభ్యులను మంగళవారం సత్యశోధక్ పాఠశాలలో ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ ఆర్. నర్సయ్య అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడా వేదికకు చేరుకోవడం గొప్ప విజయమని పేర్కొన్నారు. విద్యార్థులు తమ క్రీడా నైపుణ్యం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని ప్రదర్శిస్తూ జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల పేరు, జిల్లా గౌరవాన్ని నిలబెట్టేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీ.ఈ.టీలు అనిల్, సంతోష్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని జట్టు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో సత్యశోధక్ పాఠశాల జట్టు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.



## బాలిక మృతి ఘటనపై కేసు నమోదు

నిజామాబాద్ రూరల్, జూన్ 9 (మనం న్యూస్) : ధర్పల్లి గ్రామంలో ఓ బాలిక మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన డొక్కా శివకుమార్ తన 14 ఏళ్ల కుమార్తె డొక్కా శ్రీలక్ష్మి ఇటీవల అనారోగ్య కారణాలతో మానసికంగా కలత చెందుతూ ఉండేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంట్లో అపస్మారక స్థితిలో కనిపించిన బాలికను పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించినట్లు తెలిపారు.ఫిర్యాదు మేరకు ఎస్ఐ సందీప్ కేసు నమోదు చేసి ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అనంతర చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



## వాహనాలు తనిఖీ చేసిన పోలీసులు

బిచ్కుంద, జూన్ 9 ( మనం న్యూస్): బిచ్కుంద మండలం కందరపల్లి - బిచ్కుంద రహదారిపై మంగళవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేసినారు. వాహనాల తనిఖీల సందర్భంగా ద్విచక్ర వాహనాలు, కార్లు, రవాణా వాహనాలు వాహనాలపై ఉన్న చాలాన్లు లేదా ఆర్ సి బుక్కు, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు తనిఖీలు చేశారు. వాహనదారులను అవగాహన కల్పిస్తూ ద్విచక్ర వాహనా దారులకు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాల్సిందిగా, కార్ డ్రైవర్లకు సీట్ బెల్ట్ పెట్టుకుని డ్రైవింగ్ చేయవలసిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, మహేందర్, రాజేష్, వెంకా గౌడ్ పాల్గొన్నారు.

# భిక్నూర్ పంచాయతీ ఖజానాకు గండి

- సామాన్యుడికి చట్టాలు - కార్పొరేట్ సంస్థలకు మినహాయింపులా?
- గంపెడు కూరగాయలు అమ్ముకునే పేద రైతుకు వసూలు, ఫీజులు గుంజే స్కూల్కు ఫ్రీనా?
- భిక్నూర్ మార్కెట్ స్థలంలో ప్రైవేట్ స్కూల్ పాగా.
- 15 ఏళ్లుగా మార్కెట్ స్థల వినియోగంపై పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం.
- గణాంకాలతో అవినీతి ఆరోపణలు చేసిన సామాజిక కార్యకర్త బత్తుల భిక్షపతి.
- బకాయిలు వసూలు చేయకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరిక.





కామారెడ్డి, జూన్ 9 (మనం న్యూస్): కామారెడ్డి నియోజకవర్గంలోని భిక్నూర్ గ్రామ పంచాయతీకి రావాల్సిన లక్షల రూపాయల ఆదాయాన్ని అధికారులు కావాలనే వదులుకుంటున్నారని సామాజిక కార్యకర్త బత్తుల భిక్షపతి తీవ్ర ఆరోపణలు చేశారు. పేద రైతులు, చిరు వ్యాపారుల వద్ద గంపకు రూ.20 చొప్పున వసూలు చేసే పంచాయతీ అధికారులు, గత 15 ఏళ్లుగా మార్కెట్ స్థలాన్ని వినియోగిస్తున్న ఓ ప్రైవేట్ విద్యాసంస్థ నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయకపోవడం వెనుక కారణాలేమిటని ప్రశ్నించారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన, భిక్నూర్ మార్కెట్ స్థలాన్ని 'విద్యార్థుల ఆటస్థలం', 'బస్సుల పార్కింగ్' పేరుతో శ్రీ చైతన్య విద్యానికేతన్ యాజమాన్యం దీర్ఘకాలంగా వినియోగిస్తోందని పేర్కొన్నారు. సాధారణ ప్రజలకు ఒక న్యాయం, కార్పొరేట్ సంస్థలకు మరో న్యాయమా అని అధికారులను నిలదీశారు.

### లెక్కలు చెబుతున్న భారీ నష్టం

భిక్నూర్ మార్కెట్లో నెలకు కేవలం నాలుగు రోజులే సంత కార్యకలాపాలు జరుగుతున్నప్పటికీ, రైతులు, వ్యాపారుల నుంచి వసూలైన పన్నుల ద్వారా గ్రామ పంచాయతీకి దాదాపు రూ.60 లక్షల ఆదాయం వచ్చినట్లు భిక్షపతి వెల్లడించారు. అదే స్థలాన్ని సంవత్సరంలో 200 రోజులకు పైగా ప్రైవేట్ స్కూల్ కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్నప్పటికీ, పన్నులు విధించకపోవడం వల్ల పంచాయతీకి కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని ఆరోపించారు. పేద రైతుల వద్ద చిన్న మొత్తాలు వసూలు చేయడంలో చూపుతున్న చొరవ, పెద్ద మొత్తాల బకాయిలు వసూలు చేయడంలో ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు.

### నాలా కన్వర్షన్కు ప్రయత్నాలు?..

పంచాయతీకి బకాయిలు చెల్లించకుండా ఉండగానే, సర్వే నంబర్లు 1217/ఊ/2, 1217/ఇ/3, 1217/ఇ/2, 1217/ఆ/5, 1217/2/2, 1217/2/1లలో కొత్త విద్యాసంస్థ భవన నిర్మాణానికి నాలా కన్వర్షన్ అనుమతుల కోసం యాజమాన్యం ప్రయత్నాలు చేస్తున్నట్లు భిక్షపతి ఆరోపించారు. పాత బకాయిలు, నోటీసులు పెండింగ్లో ఉన్న నేపథ్యంలో కొత్త యజమానుల పేరుతో ఎలాంటి అనుమతులు మంజూరు చేయరాదని మండల రెవెన్యూ అధికారికి అభ్యంతర పత్రం సమర్పించినట్లు తెలిపారు.

### చర్యలు లేకపోతే పిల్

గత 15 ఏళ్లుగా చెల్లించాల్సిన పన్నులను ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం అపరాధ రుసుముతో కలిపి వెంటనే వసూలు చేయాలని భిక్షపతి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ), జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)లకు ఫిర్యాదు చేయడంతో పాటు బాధ్యులైన అధికారులను ప్రతివాదులుగా చేర్చి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం (పిల్) దాఖలు చేస్తామని హెచ్చరించారు. ఇక గ్రామ పంచాయతీ ఆస్తులు, ఆదాయాన్ని కాపాడేందుకు ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని గ్రామస్థులు కూడా కోరుతున్నారు. పేదవారి గంపపై కఠిన నిబంధనలు అమలు చేస్తూ, కార్పొరేట్ సంస్థల విషయంలో మాత్రం మౌనం ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.




## బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

- అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలుపై న్యాయవాదుల హర్షం

ఆర్మూర్, జూన్ 9 ( మనం న్యూస్ ): న్యాయవాదుల రక్షణ కోసం ప్రభుత్వం అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయడంపై ఆర్మూర్ బార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆర్మూర్ కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కుదురుపాక ప్రవీణ్ చందర్ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ హాల్లో న్యాయవాదుల సమక్షంలో కేక్ కట్ చేసి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., న్యాయవాదుల భద్రత కోసం అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. న్యాయవాదుల సమస్యలను గుర్తించి చట్టం అమలు చేసిన ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్మూర్ బార్ అసోసియేషన్ సభ్యుడు బాస వేణుగోపాల్ యాదవ్ ఇటీవల పంచాయతీ రాజ్ ట్రిబ్యునల్ బోర్డు సభ్యుడిగా నియమితులైన సందర్భంగా ఆయనను బార్ అసోసియేషన్ హాల్లో న్యాయవాదులు పట్టు శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ట్రెజరర్ వి. రాజేందర్, జాయింట్ సెక్రటరీ ఎంకే నాగరాజు, సీనియర్ న్యాయవాదులు ఎల్. భూపతి రెడ్డి, కే. గంగారెడ్డి, కృష్ణ పండిత్, చిల్క కిష్టయ్య, ఖాందేశ్ శ్రీనివాస్, జగన్, విప్లవ్ కిరణ్, గంగాధర్, సంగీత ఖాందేశ్, అశోక్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్‌లో ఇసుక సరఫరా కొరకు కొత్తగా మన ఇసుక మన వాహనం పథకం

- మన ఇసుక మన వాహనం కార్యక్రమంపై ట్రాక్టర్ యజమానులకు, డ్రైవర్లకు అవగాహన కల్పించిన తాసిల్దార్



బిచ్కుంద, జూన్ 9 (మనం న్యూస్): బిచ్కుంద మండలం లోని హస్గుల్ గ్రామ పరిధి లో గల ఇసుక క్వారీను ఆన్లైన్లో ఇసుక సరఫరా కొరకు కొత్తగా మన ఇసుక - మన వాహనం పథకం లో చేర్చడం జరిగింది. అందువలన మంగళవారం హస్గుల్ గ్రామంలోని రైతు వేదికలో మన ఇసుక మన వాహనం కార్యక్రమంపై ట్రాక్టర్ యజమానులకు డ్రైవర్లకు అవగాహన కల్పించిన తాసిల్దార్ వేణుగోపాల్. ఆన్లైన్ ఇసుక రవాణా విధానంలో తీసుకోవాల్సిన చర్యలు జాగ్రత్తల గురించి ట్రాక్టర్ డ్రైవర్లకు ఓనర్లకు వివరించడం జరిగింది. ఆన్లైన్ ఇసుక విధానం హస్గుల్ లో మొదలు పెడుతున్నందున గ్రామంలో ఎటువంటి డంపులు ఏర్పాటు చేయవద్దని మరియు ఇసుక నింపిన ట్రాక్టర్లు ట్రాలీలు ఉండడానికి వీలులేదని కేవలం నదిలోని ఇసుక పాయింటు నుండి ఇసుక ఆన్లైన్ ద్వారా ఓటిపి ద్వారా ఇవ్వడం జరుగుతుందని వారికి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వేణుగోపాల్, ఎస్ఐ రాజు, గిద్ద వార్ అంజు, గ్రామ సర్పంచ్, ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



రుద్రూర్, జూన్ 9 (మనం న్యూస్) : రుద్రూర్ మండల కేంద్రానికి చెందిన అలిమా బేగం అనారోగ్యంతో బాధపడుతుండటంతో వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకుంది. మంగళవారం ఆమెకు రూ. 24 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, ఉప సర్పంచ్ షేక్ నిస్సార్ చేతుల మీదుగా అందజేశారు. సహాయం అందించినందుకు బాధితురాలు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



## మహిళా శక్తి మహాసభకు నాగిరెడ్డిపేట్ నుంచి భారీగా తరలిన స్వయం సహాయక సంఘాల మహిళలు

నాగిరెడ్డిపేట్, జూన్ 9 (మనం న్యూస్): సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళాశక్తి మహాసభకు నాగిరెడ్డిపేట్ మండలం నుంచి స్వయం సహాయక సంఘాల మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మహిళలు ప్రత్యేక వాహనాల్లో సభకు తరలివెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల బలోపేతానికి సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని తెలిపారు. మహిళా సంఘాల రుణ పరిమితి పెంపు, వడ్డీలేని రుణాల పంపిణీ, ఆర్టీసీ బస్సుల కొనుగోలుకు ఆర్థిక సహాయం వంటి నిర్ణయాలు మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడతాయని అన్నారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ., మహిళల సంక్షేమం, అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. మహిళాశక్తి మహాసభ చారిత్రాత్మక విజయాన్ని సాధించిందని, మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జి ఏపీఎం రామ్ నారాయణ గౌడ్, మండల సమైక్య అధ్యక్షురాలు శాంతమ్మ, సీసీలు రమేష్, అకౌంటెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.



## వార్డు సభలో పరిశుభ్రత, ఎస్ఐఆర్పై అవగాహన

**- 46, 47వ వార్డుల్లో స్థానిక కౌన్సిలర్లు గెరిగంటి స్వప్న, లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో వార్డు సభ.**

కామారెడ్డి, జూన్ 9 (మనం న్యూస్): కామారెడ్డి పట్టణంలోని 46, 47వ వార్డుల్లో స్థానిక కౌన్సిలర్లు గెరిగంటి స్వప్న, లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో వార్డు సభ నిర్వహించారు. ఈ సభకు రెండు వార్డుల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ., వార్డుల అభివృద్ధికి ప్రజల సహకారం కీలకమని పేర్కొన్నారు. తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేర్వేరుగా చేసి మున్సిపల్ ఆటోకు అందించాలని సూచించారు. భూగర్భ జలాల పెంపు కోసం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అలాగే ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ ఓటరు వివరాలను 2002 ఓటరు జాబితాతో అనుసంధానం చేసుకోవాలని, ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం (ఎస్ ఐ ఆర్)ను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్వో రవిగోపాల్, ఏఈ వేణుప్రసాద్, ఎస్ఐ వినయ్ సాగర్, ఏఎస్ఐ రాజేంద్రప్రసాద్, వార్డు అధికారులు కిశోర్, రోహిదాస్, అంగన్వాడీ టీచర్ మంజుల, బీఎల్వోలు బబిత, వెంకటలక్ష్మి, అనురాధ, స్వామి, కాశిరాం, బాలురాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్అండ్‌బి ఇంజనీర్ ఇన్ చీఫ్ మోహన్ నాయక్ ఆస్తులపై ఏసీబీ సోదాలు

**- నిజామాబాద్ జిల్లాలో పలుచోట్ల తనిఖీలు.**

**- ఆదాయానికి మించి ఆస్తుల ఆరోపణలపై దర్యాప్తు**



నిజామాబాద్ రూరల్, జూన్ 9 (మనం న్యూస్): నిజామాబాద్ జిల్లాకు చెందిన తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ (ఆర్అండ్బి) ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ) జే. మోహన్ నాయక్కు సంబంధించిన నివాసాలు, ఆస్తులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం విస్తృత స్థాయిలో సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం.మోహన్ నాయక్ స్వస్థలం నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం కులాస్పూర్ తండా. గతంలో ఆయన నిజామాబాద్ జిల్లాలో ఆర్అండ్బి శాఖలో వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం తెలంగాణ రోడ్లు, భవనాల శాఖలో ఇంజనీర్ ఇన్ చీఫ్గా విధులు నిర్వహిస్తున్నారు. ఏసీబీ అధికారులు హైదరాబాద్లోని ఆయన నివాసంతో పాటు నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. కులాస్పూర్ తండాలోని స్వగృహం, ఫామ్ హౌస్తో పాటు జిల్లా కేంద్రంలోని బీఎల్ఎన్ గార్డెన్ ప్రాంతంలో నివసిస్తున్న ఆయన బావమరిది, రెవెన్యూ శాఖ డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్ నివాసంలో కూడా తనిఖీలు చేపట్టారు. అలాగే మాక్లూర్ మండలం అమ్రాద్ తండాలోని బంధువు రెడ్డి నాయక్ ఇంట్లోనూ సోదాలు నిర్వహించారు. ఏసీబీ వర్గాల సమాచారం ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 15 ప్రాంతాల్లో తనిఖీలు జరగగా, నిజామాబాద్ జిల్లాలోనే ఎనిమిది ప్రాంతాల్లో నాలుగు ప్రత్యేక బృందాలు సోదాలు నిర్వహించాయి. పలు ఆస్తులు, భూములు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలను అధికారులు పరిశీలించినట్లు తెలిసింది. మోహన్ నాయక్ అధికార దుర్వినియోగం ద్వారా భారీ స్థాయిలో ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఏసీబీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. సోదాల్లో లభించిన ఆధారాలపై పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.ఈ ఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారగా, ఏసీబీ సోదాల ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# మండల కేంద్రంలో శాఖల ఏఈలకు ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటు చేయాలి

**- వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**



నిజామాబాద్ రూరల్, జూన్ 9 (మనం న్యూస్): మండల కేంద్రంలో కీలక శాఖలకు చెందిన అసిస్టెంట్ ఇంజినీర్లు (ఏఈలు) అందుబాటులో ఉండేలా ప్రత్యేక కార్యాలయ గదులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం తహసీల్దార్కు తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవోకు ఎంపీడీవో కార్యాలయం ఉన్నప్పటికీ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల ఏఈలకు శాశ్వతంగా విధులు నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాలయాలు లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు.

గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, చెరువులు, కాలువలు, వంతెనలు వంటి అభివృద్ధి పనులకు సంబంధించిన సమస్యలు తలెత్తినప్పుడు సంబంధిత అధికారులను సంప్రదించేందుకు ప్రజలు మండల కేంద్రానికి వస్తుంటారు. అయితే ఆయా శాఖల అధికారులు ఎప్పుడు వస్తారు, ఎక్కడ అందుబాటులో ఉంటారనే విషయం స్పష్టంగా తెలియక ప్రజలు పలుమార్లు తిరగాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.

ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో రహదారుల దెబ్బతినడం, కాలువల మరమ్మతులు, వర్షపు నీటి పారుదల సమస్యలు, చెరువుల సంరక్షణ వంటి అంశాలు అత్యవసరంగా మారాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ సమయంలో ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల అధికారులు మండల కేంద్రంలోనే అందుబాటులో ఉంటే సమస్యలను వెంటనే పరిష్కరించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే సంబంధిత శాఖల ఏఈలకు మండల కేంద్రంలో ప్రత్యేక గదులు, కార్యాలయ సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్యంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వ శాఖల అధికారులు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే విధంగా శాశ్వత కార్యాలయాలు ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రాంతాల్లోని అనేక సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.





# సిరికొండలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం

**– పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యమని నేతల పిలుపు.**



నిజామాబాద్ రూరల్, జూన్ 9 (మనం న్యూస్): సిరికొండ మండల కేంద్రంలోని దాస్ ఫంక్షన్ హాల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మండల కార్యవర్గ సమావేశం ఘనంగా నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ నాయకుడు దినేష్ కులాచారి పటేల్ పార్టీ శ్రేణులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., పార్టీ బలోపేతానికి కార్యకర్తలు క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. అలాగే ఎస్ ఐ ఆర్ అంశంపై నాయకులు, కార్యకర్తలకు సమగ్ర అవగాహన కల్పించి, పార్టీ చేపట్టాల్సిన కార్యాచరణపై వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతూ ప్రజల పక్షాన నిలవాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న ప్రజలకు మరింత చేరువై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నక్క రాజేశ్వర్, మండల అధ్యక్షుడు సంజీవ్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు రాజేందర్, బాబురావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజేశ్వర్ రెడ్డి, గంగారెడ్డి, మధు, ప్రభాకర్, శ్రీనివాస్, తుంపల్లి సర్పంచ్ రాజేందర్తో పాటు గంగారం, ధర్మపురి, గోవింద్, లింబాద్రి, సతీష్, భాస్కర్, కళ్యాణ్, రవి, రూపేష్, బిట్టు, బన్నీ, రాజు, దాస్, సుమన్, మోహన్, అజయ్, మారుతి, సాయికుమార్, శ్రీనివాస్, రఘు, సత్యనారాయణ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలపై ఉద్యమాలు, కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారం తదితర అంశాలపై చర్చించినట్లు నాయకులు తెలిపారు.

# ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్‌కు ఆశ వర్కర్ల వినతిపత్రం



ఎల్లారెడ్డి, జూన్ 9 (మనం న్యూస్): ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ కి మంగళవారం ఆశ వర్కర్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ అసోసియేషన్ ఎల్లారెడ్డి మండల అధ్యక్షురాలు టి మంజుల మాట్లాడుతూ., ఆశా వర్కర్లకు ప్రతి నెల ఒకటవ తేదీన పారితోషికాలు చెల్లించాలని, రూ.18,000/-ల ఫిక్స్డ్ వేతనం, ఇతర సమస్యలు పరిష్కరించాలని, ఆశా వర్కర్లకు ప్రతి నెల 1వ తేదీన పారితోషికాలు వచ్చే విధంగా చూడాలని, తెలంగాణ రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు గత 20 సంవత్సరాల నుండి పేద ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నారు. వీరంతా మహిళలు బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే అత్యధికులున్నారు. నేటికి వీరికి ఎలాంటి చట్టబద్ధ సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం గ్యారెంటీ ఫిక్స్డ్ వేతనం కూడా ఇప్పటివరకు ప్రభుత్వం నిర్ణయం చేయలేదు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం 2023 సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 9 వరకు 15 రోజులు రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్లు నిరవధిక సమ్మె చేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చింది. అనంతరం వచ్చిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటింది. ఈ కాలంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చింది. 50 లక్షల ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర హామీలు పి.ఆర్.సి. ఎరియర్స్, లెప్రసీ, పల్స్ పోలియో, ఎలక్షన్ డ్యూటీ డబ్బులు సంవత్సరాల తరబడి పెండింగ్లో ఉన్నాయి. కావున పై సమస్యలు పరిశీలించి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తీర్చాలని మా యొక్క డిమాండ్ లను స్థానిక ఎమ్మెల్యే మదన్మోహన్ దృష్టికి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ తీసుకెళ్లాలని మా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, పిఎసిసి వైస్ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, కౌన్సిలర్ గఫార్ మరియు ఆశ వర్కర్లు లావణ్య, సునీత, అంజమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

# గోపాల్పేట్ క్రీడాకారులకు ఏకరూప దుస్తుల పంపిణీ

నాగిరెడ్డిపేట, జూన్ 9 (మనం న్యూస్): తాడ్వాయి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్న గోపాల్పేట్ గ్రామ క్రీడాకారులకు బీజేపీ నాయకురాలు కొండమీరాతాయి ఏకరూప క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ., క్రీడారంగంలో ప్రతిభ కనబర్చి విజయాలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. భవిష్యత్తులో కూడా క్రీడాకారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు హనుమాన్లు, నాయకులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.





## ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డిప్యూటీ కమిషనర్

భిక్నూర్, జూన్ 9 ( మనం న్యూస్ ): భిక్నూర్ మండల కేంద్రాన్ని డిప్యూటీ కమిషనర్ రవీందర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయాన్ని సందర్శించిన ఆయన, అక్కడ నిర్వహిస్తున్న ఆన్లైన్ విధానాన్ని, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. మండలంలోని పలు గ్రామపంచాయతీలకు సంబంధించిన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆయా గ్రామపంచాయతీలకు అందుతున్న నిధులు, వాటిని ఏ విధంగా ఖర్చు చేస్తున్నారు, ప్రగతి పనుల పురోగతి ఎలా ఉందనే అంశాలపై ఆయన ఆరా తీశారు. నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని, రికార్డులను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో అప్డేట్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ ఆకస్మిక తనిఖీలో డిప్యూటీ కమిషనర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) మురళి, భిక్నూర్ ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి, మండల పంచాయతీ సిబ్బంది మరియు ఈఓపీఆర్డీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం..

**భిక్నూర్లో ఘనంగా 'బడి బాట' కార్యక్రమం**



భిక్నూర్, జూన్ 09 ( మనం న్యూస్ ): పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలే కేరాఫ్ అడ్రస్ అని, అర్హులైన ప్రతి విద్యార్థిని ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని కోరుతూ మండల కేంద్రమైన భిక్నూర్ పట్టణంలో 'బడి బాట' కార్యక్రమాన్ని మంగళవారం ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పట్టణంలోని పలు వార్డులలో, ఇండ్ల వద్దకు వెళ్లి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

**ఇంటింటికీ వెళ్లి అవగాహన..**

ఉపాధ్యాయులు పట్టణంలోని ప్రతి వీధిలో తిరుగుతూ, ఇండ్లలోని తల్లిదండ్రులను కలిసి వారి పిల్లల చదువుల గురించి ఆరా తీశారు. బడి బయట ఉన్న పిల్లలను, ఐదేళ్లు నిండిన చిన్నారులను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ బడులలో అందుతున్న నాణ్యమైన విద్యా విధానాన్ని తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న, ఉమా, విజయకుమారి పాల్గొన్నారు